వడ్డీ రాయితీతో మహిళల పురోగతి

- ఆర్థికాభివృద్ధి చెందుతున్న డ్వాక్రా సంఘాల సభ్యులు
- నియోజకవర్గంలో 4990 మందికి రూ.34.32 కోట్ల మేర లబ్ధి

నియోజకవర్గంలో మండలాల వారీగా డ్వాక్రా మహిళలు పొందిన లబ్ధి

మండలం	సంవత్సరాలు	లబ్దిదారుల సంఖ్య	సొమ్ములు(రూ.కోట్లలో)
పెరవలి	2019-23	1453	12.45
ఉండ్రాజవరం	2019-23	1314	10.80
నిడదవోలు	2019-23	1486	11.07
		4253	43.32

పెరవలి: మహిళల ఆర్థిక ప్రగతి సాధించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డి వైఎస్సార్ సున్నా వడ్డీ పథకాన్ని తీసుకు వచ్చారు. డ్వాక్రా మహిళలు తీసుకున్న రూ.3 లక్షల లోపు రుణానికి వడ్డీ ప్రభుత్వమే చెల్లిస్తుందని ప్రకటించిన ముఖ్యమంత్రి అందుక నుగుణంగా నాలుగేళ్లగా వడ్డీ సొమ్మును లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా జమ చేస్తున్నారు. ఆయా డ్వాక్రా సంఘాలు తమ పొదుపు స్థాయిని బట్టి బ్యాంకుల రూ.లక్ష నుంచి రూ.20 లక్షల వరకూ రుణాలు పొందుతాయి. అయితే ప్రభుత్వం మాత్రం రూ.మూడు లక్షల రుణాలకు మాత్రమే వడ్డీ చెల్లిస్తున్నది.

వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం కింద నిడదవోలు నియోజకవర్గంలో గత నాలుగేళ్లలో రూ.34.32 కోట్ల వడ్డీ రాయితీ సొమ్మును 4,990 మంది మహిళలకు ప్రభుత్వం అందించింది. దాంతో మహిళలు తీసుకున్న అప్పుకు వడ్డీ భారం పడడం లేదు. ఆ మేరకు వారు ఆర్థిక ప్రయోజనం పొందుతున్నారు. అంతేగాకుండా వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా పథకాల ద్వారా మహిళలకు రుణాలు మంజూరు చేస్తున్నారు. ఇలాంటి ఆర్థిక చేయూతతో మహిళలు చిన్న చిన్న వ్యాపారాలు, స్వయం సహాయక యూనిట్లు ఏర్పాటు చేసుకుని, వచ్చే ఆదాయంతో కుటుంబానికి చేదోడువాదోడుగా ఉంటున్నారు. డ్వాక్రా రుణాలను మాఫీ చేస్తా మని హామీ ఇచ్చి 2,014లో అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వం అధికారం వచ్చిన తరువాత ఆ మాటే మరచిపోయింది. టీడీపీ అధినేత చంద్రబాబు మాటలు నమ్మి డ్వాక్రా రుణాలు చెల్లించని మహిళలు ఆ తర్వాత ఆర్థికంగా నలిగిపోయారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మాత్రం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు క్రమం తప్పకుండా డ్వాక్రా రుణాలపై వడ్డీ మాఫీని అమలు చేస్తోంది.


వైఎస్సార్ సున్నా వడ్డీ రాయితీ చెక్కు పంపిణీ సభలో ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు (ఫైల్)

ధీమా ఏర్పడింది



వైఎస్సార్ సున్నా పథకం వలన మా ఆర్థిక ఇబ్బందులు తొలగాయి. అంతేకాదు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై నమ్మకం ఏర్పడింది. బ్యాంకుల్లో రుణం తీసుకున్నప్పటికీ మహిళలకు వడ్డీ భారం ఉండదనే ధీమా ఏర్పడింది.

– తాడి శ్యామల, డ్వాక్రా మహిళ, పెరవలి

టీడీపీ హయాంలో ఇబ్బందులు



గత టీడీపీ ప్రభుత్వం సున్నా వడ్డీని సకాలంలో బ్యాంకు ఖాతాలకు జమ కాలేదు. దాంతో డ్వాక్రా మహిళలం అనేక ఇబ్బందుల పడ్డాం. ఈ ప్రభుత్వంలో అలాంటి సమస్య రాలేదు. నాలుగేళ్ళుగా సకాలంలో సొమ్ములు పడుతున్నాయి.

– మానేపల్లి రత్నకుమారి, డ్వాక్రా మహిళ, పెరవలి

అప్పుడు రుణమాఫీ కాలేదు



టీడీపీ ప్రభుత్వంలో రుణమాఫీ చేస్తానన్నారు. చేయలేదు. దాంతో బ్యాంకులో తీసుకున్న అప్పునకు రెట్టింపు వడ్డీ చెల్లించాల్సి వచ్చింది. నేడు అప్పు తీసుకున్నా వడ్డీ భారం మాపై లేకుండా ప్రభుత్వమే చెల్లిస్తున్నది. దీంతో గత నాలుగేళ్లలో మా ఆర్థిక పరిస్థితి మెరుగుపడింది.

– కప్పల కుమారి, డ్వాక్రా మహిళ, కాపవరం

క్లుప్తంగా

వర్సిటీ టాపర్‌కు స్వగ్రామంలో సత్కారం


పెద్దేవంలో మృదులను సత్కరిస్తున్న సర్పంచ్, వైఎస్సార్ సీపీ నాయకులు

తాళ్లపూడి: సరస్వతీ పుత్రికను గ్రామస్తులు సత్కరించారు. యూనివర్సిటీ టాపర్‌గా నిలిచిన వై.మృదులను ఆమె స్వగ్రామమైన పెద్దేవంలో గ్రామస్తులు ఆదివారం ఘనంగా సత్కరించారు. విజయవాడలోని డాక్టర్ వైఎస్సార్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్‌లో బ్యాచిలర్ ఆఫ్ ఫిజియోథెరపీ చదివిన మృదుల యూనివర్సిటీ టాపర్‌గా నిలిచింది. ఈ క్రమంలో పెద్దేవం గ్రామంలోని ఫిలిదెల్ఫియా చర్చిలో సర్పంచ్ తిగిరిపల్లి వెంకటరావు, ఉప సర్పంచ్ తోట రామకృష్ణ ఆధ్వర్యంలో మృదులను, ఆమె తల్లిదండ్రులు ఫాదర్ వైజీ రాజు, విజయలక్ష్మిలను గ్రామస్తులు సత్కరించారు. జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు మైలవరపు రాధాకృష్ణ, బట్టు సుబ్బారావు, తోట చంద్రయ్య, నల్లాకుల వేణుగోపాలకృష్ణ, వార్డు సభ్యులు కొయ్యే మంగ, పెదవేగి వీరమణి తదితరులు పాల్గొన్నారు.

వేణుగోపాలునికి వెండి శఠగోపం సమర్పణ


వేణుగోపాలస్వామికి వెండి శఠగోపం సమర్పిస్తున్న రామకృష్ణ, నాగమణి దంపతులు

నల్లజర్ల: గ్రామంలోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వారికి ఆదివారం గ్రామానికి చెందిన మద్దిపాటి రామకృష్ణ, నాగమణి దంపతులు రూ.25 వేల విలువైన వెండి శఠగోపాన్ని సమర్పించారు. తమ కుమార్తె గీతాసాయి హర్షిత పేరిట వారీ వెండి శఠగోపాన్ని సమర్పించారు.అలాగే నల్లజర్ల గ్రామానికే చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు నిమ్మలపూడి వీరరాఘవులు కుమారుడు నిమ్మలపూడి ప్రసాద్ రూ.25 వేల విలువైన బంగారు నేత్రాలను వేణుగోపాలస్వామి వారికి సమర్పించారు.

గ్రామీణ డాక్ సేవక్స్ నూతన కార్యవర్గం

నిడదవోలు: ఆల్ ఇండియా గ్రామీణ డాక్ సేవక్స్ తాడేపల్లిగూడెం డివిజన్ సర్వసభ్య సమావేశాన్ని ఆదివారం నిడదవోలు సబ్ పోస్టాఫీసులో నిర్వహించారు. సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తాడేపల్లిగూడెం డివిజన్ ఆల్ ఇండియా గ్రామీణ డాక్ సేవక్స్ నూతన అధ్యక్షుడిగా కె.రవీంద్ర, కార్యదర్శిగా ఎస్.రమేష్, కోశాధికారి పవన్‌కుమార్, గౌరవాధ్యక్షులుగా ప్రసాద్‌రాజు, నాగేశ్వరరావు ఎంపికయ్యారు. కార్యక్రమంలో లక్ష్మీహనుమంతరావు, రాజసామేబ్, దుర్గారావు పాల్గొన్నారు.

టీడీపీ సామూహిక నిరాహార దీక్ష

ఉండ్రాజవరం: తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడి అరెస్టుకు నిరసనగా మండలంలోని వేలివెన్ను గ్రామంలో ఆదివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆ పార్టీ మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు సామూహిక నిరాహార దీక్ష నిర్వహించాయి. కార్యక్రమంలో నియోజకవర్గంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ద్వారకా తిరుమల మండలంలో 144 సెక్షన్

ద్వారకాతిరుమల: తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడి అరెస్టు నేపథ్యంలో ఆ పార్టీ సానుభూతి పరులు చేస్తున్న నిరసన కార్యక్రమాలు ఉద్రిక్తతకు దారి తీస్తున్నాయని, అందువల్ల మండల రెవెన్యూ పరిధిలో ఈనెల 16 వరకూ 144 సెక్షన్ అమలు చేస్తున్నట్టు ఎస్సై టి.సుధీర్ తెలిపారు. కావున నలుగురు కంటే ఎక్కువ మంది గుమ్మికూడి ఉండరాదన్నారు. అలాగే ర్యాలీలు, ఊరేగింపులు నిర్వహించే వారు ముందుస్తుగా అధికారుల నుంచి అనుమతులు పొందాలని సూచించారు.

కొవ్వూరు డివిజన్‌లోనూ 144 సెక్షన్

కొవ్వూరు: కొవ్వూరు రెవెన్యూ డివిజన్‌లో 144 సెక్షన్ అమలులో ఉందని టౌన్ సీఐ వి.జగదీశ్వరరావు తెలిపారు. సిల్క్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కుంభకోణంలో అరెస్టయిన టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడిని రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలిస్తున్న నేపథ్యంలో పట్టణంలో శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా ముందస్తుగా ఆదివారం 57 మంది టీడీపీ నాయకులను అరెస్టు చేశామని ఆయన తెలిపారు. ఎక్కడైనా ఎవరైనా అల్లర్లకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 144 సెక్షన్ అమల్లో ఉన్నందున నలుగురికి మించి గుమిగూడినా, ఆందోళనలు, ర్యాలీలు, రాస్తారోకోలు నిర్వహించిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఇరు వర్గాలకూ కలిసొచ్చిన బాబు అరెస్ట్


నల్లజర్ల శిబిరంలో శనివారం దీక్ష చేస్తున్న మద్దిపాటి వర్గం నాయకులు


నల్లజర్ల రెండో శిబిరంలో శనివారం దీక్ష చేస్తున్న ముప్పిడి వర్గం నాయకులు

- గోపాలపురం నియోజకవర్గంలో పోటాపోటీగా టీడీపీ నిరసనలు
- ప్రజాదరణ మాత్రం కరవు
- హడావుడి అంతా 'పచ్చ' నేతలదే

ద్వారకాతిరుమల: తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు అరెస్ట్ కావడం గోపాలపురం నియోజకవర్గంలోని ఆ పార్టీ నేతలకు బాగా కలిసొచ్చింది. తమ ఆధిపత్యాన్ని ప్రదర్శించి, అధిష్టానం దృష్టిలో పడేందుకు రెండు వర్గాల వారు నిరసనల పేరుతో నానా హడావుడీ చేస్తున్నారు. అయినా ప్రజాదరణను మాత్రం పొందలేక పోతున్నారు. వివరాల్లోకి వెళితే. మాజీ ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావును పక్కన బెట్టి, మద్దిపాటి వెంకటరాజును పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా అధిష్టానం ప్రకటించినప్పటి నుంచి పార్టీ నేతల్లో వర్గ విభేదాలు ఏర్పడ్డాయి. అవకాశం, సమయం కుదిరినపుడల్లా ఆ రెండు వర్గాలు ఆధిపత్యం కోసం పోరాడుతున్నాయి. ఈ క్రమంలోనే మద్దిపాటిని ఇన్‌చార్జిగా తొలగించి, ముప్పిడిని మళ్లీ కొనసాగించాలని పార్టీలోని కొందరు బలమైన నాయకులు అధిష్టానం దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా ఫలితం దక్కలేదు. ఏదేమైనా వచ్చే ఎన్నికల్లో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా నిలవాలని ముప్పిడి వర్గం శతవిధాలా ప్రయత్నాలు చేస్తోంది. అలాగే మద్దిపాటి వర్గం నియోజకవర్గంలో ఏదో రకంగా హైప్ అయ్యి, సొంత పార్టీలోనే ప్రత్యర్థి వర్గాన్ని ఎదుర్కోవాలని చూస్తోంది. ఈ క్రమంలోనే చంద్రబాబు నాయుడి అరెస్టును ఆ రెండు వర్గాలు ఒక ఆయుధంలా వాడుకుని, తమ ఆధిపత్యాన్ని చాటేందుకు శతవిధాలా ప్రయత్నిస్తున్నాయని ప్రజలు భావిస్తున్నారు. అందులో భాగంగానే చంద్రబాబు అరెస్ట్ అయిన తొలిరోజు నల్లజర్ల సెంటర్‌లో మద్దిపాటి, ముప్పిడి వర్గాలు వేరువేరుగా రెండు టెంట్లు వేసి, ఆందోళన చేశారు. అలాగే ఆదివారం మద్దిపాటి తన వర్గం నాయకులతో కలసి ద్వారకాతిరుమలలో, ముప్పిడి హౌస్ అరెస్ట్ కావడంతో తన వర్గం నాయకులు దేవరపల్లిలో నిరాహార దీక్షలు చేశారు.

ముస్తాబవుతున్న మట్టి గణనాథులు

- పాలంగిలో 36 ఏళ్లుగా తయారీ


పాలంగిలో మట్టి విగ్రహానికి రంగులు అద్దుతున్న తయారీదారులు

ఉండ్రాజవరం: వినాయక చవితి ఉత్సవాలకు గణనాథుల విగ్రహాలు ముస్తాబవుతున్నాయి. పాలంగి గ్రామంలోని శిల్ప కళా నిలయంలో వినాయక విగ్రహాలను మట్టితో తయారు చేస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఇక్కడ మట్టితో పాటు సుద్ధతో తొలుల వినాయక విగ్రహాలను తయారు చేస్తున్నారు. అనంతరం వాటికి రంగులు వేసి తీర్చిదిద్దాక ఆ విగ్రహాలు చూపరులను ఆకర్షిస్తున్నాయి. 36 సంవత్సరాల నుంచి మట్టి వినాయకుని విగ్రహహాలను తయారు చేస్తున్నామని విగ్రహాల తయారీదారుడైన బి.సాంబశివరావు తెలిపారు. తమ కుటుంబం అంతా విగ్రహాల తయారీపైనే ఆధారపడి జీవిస్తున్నామని తెలిపారు. మట్టి, సుద్ధ అధిక ధర పెట్టి కొనుగోలు చేయవలసి వస్తోందని తెలిపారు. మండలంలోని పాలంగి, ఉండ్రాజవరం, కె.సావరం, చివటం, మోర్త, వేలివెన్ను, సూర్యారావుపాలెం తదితర గ్రామాలతో పాటు తణుకు పరిసర వాసులు కూడా ఇక్కడి నుంచే విగ్రహాలను తీసుకువెళతారని తెలిపారు.

కోటసత్తెమ్మ వారి ఆదాయం రూ.85 వేలు

నిడదవోలు రూరల్: శ్రావణ మాసం కావడంతో మండలంలోని తిమ్మరాజుపాలెంలో కొలువైన కోట సత్తెమ్మ వారి ఆలయానికి ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు అప్పారావుశర్మ పర్యవేక్షణలో అమ్మవారికి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. దర్శనాలు, ప్రసాదం, పూజా టిక్కెట్లు, ఫొటోల అమ్మకం ద్వారా రూ.85,020 ఆదాయం వచ్చిందని ఆలయ ఈఓ బళ్ల నీలకంఠం(శివ) తెలిపారు.

వలంటీర్లకు నియామక పత్రాల అందజేత


వలంటీర్లకు నియామక పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

ద్వారకాతిరుమల: ప్రజా సేవే లక్ష్యంగా వలంటీర్లు విధులు నిర్వర్తించాలని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. మండలంలోని సత్తెన్నగూడెంలో ఇటీవల తొలగించిన వలంటీర్ల స్థానంలో, మరో ఐదుగురు వలంటీర్లను కొత్తగా నియమించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలారి దేవరపల్లిలోని ఆయన క్యాంపు కార్యాలయంలో నూతన వలంటీర్లు మానుకొండ ప్రసన్నకుమార్, కుమ్మరి అనురాధ, తాడేపల్లి అశ్విని, తోరం మమత, తానిగడప నాగమణిలకు ఆదివారం నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ద్వారకాతిరుమల చిన వెంకన్న దేవస్థానం ట్రస్టుబోర్డు సభ్యుడు మానుకొండ సుబ్బారావు ఉన్నారు.

గణపతి ఉత్సవాలకు రాటముహూర్తం

కడియం: మండలంలోని పలు గ్రామాల్లో గణపతి నవరాత్ర ఉత్సవాలకు ఆదివారం పందిరి రాటలను ప్రతిష్టించారు. నిర్ణీత ముహూర్తానికి ప్రత్యేక పూజలు చేసి ఈ కార్యక్రమం జరిపారు. కడియపులంకలోని ముసలమ్మ ఆలయం వద్ద విద్యాలక్ష్మీ గణపతి నవరాత్ర ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయ కమిటీ సభ్యులు రాటను పాతారు. దుళ్ల శివాలయం వీధిలోని లక్ష్మీగణపతి ఆలయ కమిటీ సభ్యులు కూడా రాటను పాతి ఉత్సవ ఏర్పాట్లకు శ్రీకారం చుట్టారు.

శ్రీవారి దేవస్థానం ట్రస్టు బోర్డులోకి మరో ముగ్గురు


తొమ్మండ్రు రమేష్


తాతా శ్రీనివాసరావు


కొట్టు వెంకటేశ్వరరావు

ద్వారకాతిరుమల: స్థానిక శ్రీ వేంకటేశ్వర స్వామివారి దేవస్థానం పాలకవర్గం (ట్రస్ట్ బోర్డ్)లోకి ప్రత్యేక ఆహ్వానితులుగా ముగ్గురిని నియమిస్తూ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కరికాల వల్లభన్ ఈనెల 7న ఆదేశాలు జారీ చేశారు.నల్లజర్ల మండలం ఘంటావారిగూడెంకు చెందిన తొమ్మండ్రు రమేష్, తాడేపల్లిగూడెంకు చెందిన తాతా శ్రీనివాసరావు, కొట్టు వెంకటేశ్వరరావులను నియమించారు. దాంతో ప్రస్తుతం 15 మంది సభ్యులుగా ఉన్న పాలకవర్గం, ఈ ముగ్గురి నియామకంతో 18 కి చేరింది. కొత్తగా నియమితులైన వారు త్వరలో ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

15 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష

నల్లజర్ల: పేదల ఆరోగ్య పరిరక్షణ లక్ష్యంగా, ఈ నెల 15 నుంచి గ్రామగ్రామానా జగనన్న ఆరోగ్య సురక్ష పేరిట కొత్త కార్యక్రమం ప్రారంభం అవుతుందని ఎంపీడీఓ రాజశేఖర్, నల్లజర్ల పీహెచ్‌సీ డాక్టర్ తెల్లం గంగాధరరావు శనివారం తెలిపారు. అలాగే ఈ నెల 30 నుంచి గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తామని తెలిపారు.ఈ వైద్య శిబిరాల్లో సేవలు అందించేందుకు ప్రభుత్వం మండలానికి ఇద్దరు స్పెషలిస్టులను ఏర్పాటు చేసిందన్నారు.వైద్య శిబిరాలపై ఈ నెల 15 నుంచి ఏఎన్‌ఎం, ఎంపీహెచ్‌ఓలు ఇంటింటి ప్రచారం నిర్వహిస్తారన్నారు. 30 నుంచి నిర్వహించే వైద్య శిబిరాల్లో ఆరోగ్య సమస్యలు ఉన్నవారికి స్థానికంగా వైద్యం అందించడంతో పాటు మెరుగైన వైద్యం అవసరమైతే స్పెషలిస్టులకు,ఆసుపత్రులకు సిఫార్సు చేస్తారన్నారు. మండలంలోని రెండు ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల పరిధిలో సబ్ సెంటర్ల వారీగా ఈ వైద్యశిబిరాలు జరుగుతాయన్నారు.

విద్యార్థిని చదువుకు రూ.20 వేల ఆర్థిక సాయం


విద్యార్థినికి ఆర్థిక సాయం చేస్తున్న మానవత సంస్థ సభ్యులు

నల్లజర్ల: మండలంలోని చీపురుగూడెంకు చెందిన కలగర ఈశ్వరీ వెంకట దీపిక తాడేపల్లిగూడెం వాసవీ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ సెకండియర్ చదువుతోంది. ఆమె తండ్రి శ్రీను ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగా ఉండడంతో ఆ విద్యార్థిని చదువుకు మానవత సేవా సంస్థ మండల శాఖ ఆదివారం రూ.20 వేల ఆర్థిక సాయాన్ని అందజేసింది. కార్యక్రమంలో మానవత సంస్థ మండల శాఖ చైర్మన్ భోగవల్లి వెంకట సుబ్బారావు, అధ్యక్షుడు ఐడీవీ అప్పారావు, గుళ్ళపూడి వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపూడిలో వృద్ధుడికి..

తాళ్లపూడి: స్థానిక వృద్ధుడు చల్లా సుబ్రహ్మణ్యం జీవనోపాధి లేక పక్షవాతంతో బాధపడుతున్నాడు. ఈ నేపథ్యంలో మానవత సంస్థ మండల శాఖ ఆదివారం ఆ వృద్ధుడికి రూ.ఆరు వేల ఆర్థిక సాయాన్ని మండల శాఖ అధ్యక్షుడు సాయన సుబ్బారావు చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో మానవత సంస్థ సభ్యులు వి. చంద్రయ్య, సీహెచ్ ఆంజనేయులు, అప్పన హనుమంతరావు, టీఎస్‌బీ గుప్త, సనపల రాజశేఖర్ పాల్గొన్నారు.

14 నుంచి ఉచిత కంప్యూటర్ శిక్షణ

నిడదవోలు: తమ కళాశాలలో ఈ నెల 14వ తేదీ నుంచి ఉచిత కంప్యూటర్ శిక్షణ ఇస్తున్నట్టు స్థానిక ఎస్వీఆర్ఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జ్యోతి తెలిపారు. ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ శిక్షణ ఇస్తున్నామని, ఆసక్తి గల అభ్యర్థులు కళాశాల్లో ముందుగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఇంటర్ ఆపై ఉత్తీర్ణులైన అభ్యర్థులకు డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్, ఇంటర్ ఆపై ఉత్తీర్ణులైన అభ్యర్థులకు అకౌంట్స్ ఎగ్జిక్యూటివ్ విత్ టాలీ, పదో తరగతి ఆపై ఉత్తీర్ణులైన అభ్యర్థులకు ఆఫీస్ అసిస్టెంట్ విత్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులలో ఉచిత కంప్యూటర్ శిక్షణ అందిస్తున్నట్లు ఆమె వివరించారు. మరిన్ని వివరాలకు 96760 52454 అనే సెల్ నంబర్‌లో సంప్రదించాలని ప్రిన్సిపాల్ జ్యోతి తెలిపారు.

బోధనేతర పనులతో భారం

కంబాలచెరువు: రాష్ట్ర ప్రభుత్వం బోధనేతర పనుల పేరుతో ఉపాధ్యాయులను ఒత్తిడికి గురి చేసి, విద్యాబోధన సక్రమంగా చేయడం లేదని అనడం విడ్డూరంగా ఉందని యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్.ప్రసాద్ అన్నారు. స్థానిక ఎల్ఐసీ ఎంప్లాయీస్ హోమ్ మోడల్ కాలనీలో ఆదివారం రాష్ట్రస్థాయి ప్రాంతీయ వర్క్ షాప్ జరిగింది. దీనికి తూర్పుగోదావరి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, విజయవాడ జిల్లాల యూటీఎఫ్ నాయకులు హాజరయ్యారు. ప్రసాద్ మాట్లాడుతూ పర్యవేక్షణ పేరుతో ఉపాధ్యాయులను కించపరుస్తున్న పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్‌ను తక్షణమే తొలగించాలని డిమాండ్ చేశారు.

'నా భూమి- నా దేశం' విజయవంతం చేయాలి


కొవ్వూరు రాజీవ్ కాలనీలో ర్యాలీ చేస్తున్న బీజేపీ నాయకులు

గోపాలపురం: 'నా భూమి నాదేశం' కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, ఆ పార్టీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు సోము వీర్రాజు అన్నారు. నాభూమి నాదేశం కార్యక్రమంలో భాగంగా ఆదివారం గోపాలపురంలోని బీజేపీ కార్యాలయం వద్ద మట్టిని సేకరించారు. ఈ సందర్భంగా సోము వీర్రాజు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. బీజేపీ శ్రేణులు వాటి గురించి ప్రజలకు వివరించాలని కోరారు. గ్రామస్థాయి నుంచి పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు, కిసాన్ మోర్చా గోదావరి జోనల్ ఇన్‌చార్జి కైరం అప్పారావు నాయుడు, పార్టీ గోపాలపురం మండల శాఖ అధ్యక్షుడు గెల్లా శ్రీనుబాబు, ఎస్ సత్యకుమార్‌శర్మ, మైలు శ్రీనివాస్, నాయకులు కొండేపాటి రత్నాజీ చౌదరి, నాగేంద్ర, ఇల్లూరి పెంటలరాజు పాల్గొన్నారు.

కొవ్వూరులో బీజేపీ ర్యాలీ

కొవ్వూరు: ప్రజల్లో దేశభక్తిని పెంపొందించే ప్రక్రియలో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ 'నా భూమి నాదేశం' కార్యక్రమానికి పిలుపు ఇచ్చారని బీజేపీ జిల్లా కార్యదర్శి పిక్కి నాగేంద్ర అన్నారు. పట్టణంలోని రాజీవ్ కాలనీలో ప్రజలను చైతన్యం చేస్తూ బీజేపీ నాయకులు కలశం ద్వారా మట్టిని సేకరించారు. స్వాతంత్ర్య సమర యోధులను స్మరించుకోవడానికి ప్రధాని నిర్మిస్తున్న స్మృతివనంలో ఈ మట్టిని ఉంచుతారన్నారు. బీజేపీ కౌన్సిలర్ పిల్లలమర్రి మురళీకృష్ణ, ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాట్లా ఆంజనేయులు, చెరుకూరి సాయి రాజు, బాదరాల ఉమామహేశ్వరరావు, గరికిన శ్రీను, బెనుకు శ్రీను,అర్జెల్లి లక్ష్మణ్ పాల్గొన్నారు.

శ్రీవారి పథకాలకు రూ.2 లక్షల విరాళం


దాత హరీష్‌కు విరాళం బాండ్ అందిస్తున్న దృశ్యం

ద్వారకా తిరుమల: శ్రీవారి పథకాలకు ముగ్గురు భక్తులు ఆదివారం వేర్వేరుగా రూ.2,00,787 మేర విరాళాలు సమర్పించారు. నిత్యాన్నదాన పథకానికి ఎల్‌వీ సుబ్బారావు (తాడేపల్లిగూడెం) రూ.50,116, గోసంరక్షణ పథకానికి ఎస్.ఉమాసాయి రూ.50,116 అందించారు. వారికి ఆలయ ఏఈఓ ఆర్.లక్ష్మణస్వామి విరాళం బాండ్ పత్రం అందించారు. నిత్యాన్నదాన పథకానికి ఘంటా వెంకట హరీష్ (నిడదవోలు) రూ.1,00,555 అన్నదాన కార్యాలయంలో జమ చేశారు. ఆయనకు సీనియర్ అసిస్టెంట్ జగన్ విరాళం బాండ్ పత్రం అందజేశారు.

కంబాల చెరువు పార్కులో స్వచ్ఛభారత్

ప్రకాశం నగర్: జేసీఐ రాజమహేంద్రవరం స్టార్లప్స్ ఆధ్వర్యంలో స్థానిక కంబాలచెరువు పార్కులో ఆదివారం స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ (జేసీఐ) వారోత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. జేసీఐ స్టార్లప్స్ అధ్యక్షురాలు మోహన ప్రియ మాట్లాడుతూ ఈ వారం అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, దానిలో భాగంగా రెండో రోజు క్లీన్ వాటర్ అండ్ శానిటేషన్ చేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం నగరంలో వైరల్ జ్వరాలు అధికంగా ఉన్నాయన్నారు. మన చుట్టుపక్కల ఉండే పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా, నీరు కలుషితం కాకుండా చేసి ఈ జ్వరాల బారినపడకుండా రక్షించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి జేసీ పావని పద్మావతి, సభ్యులు దుర్గాభవాని, సుజన్ గ్రేస్, భరణీ దేవి, దీపిక పాల్గొన్నారు.

పిల్లలకు పౌష్టికాహారం పంపిణీ

కంబాలచెరువు: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ఏఆర్‌టీ విభాగంలో బ్రైట్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆదివారం హెచ్‌ఐవీ పాజిటివ్ పిల్లలకు పౌష్టికాహారం పంపిణీ చేసింది. ఈ కార్యక్రమానికి పీఎంపీ జిల్లా కో కన్వీనర్ బళ్లా శ్రీనివాసరావు, డాక్టర్ మల్లాది అనూహ్య హాజరయ్యారు. వారు మాట్లాడుతూ హెచ్‌ఐవీ వ్యాధిగ్రస్తులు పౌష్టికాహారంతో తీసుకుంటే రోగనిరోధక శక్తి పెరిగి ఆరోగ్యవంతులుగా ఉంటారన్నారు. ప్రతినెలా పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న బ్రైట్ సేవాసంస్థ కార్యదర్శి తాతపూడి జయశ్రీ, సంస్థ సభ్యులను అభినందించారు. పౌష్టికాహారంలో భాగంగా పిల్లలకు గోధుమ రవ్వ, ముర్రి ఉండలు, బెల్లం, రస్కులు, చోడిపిండి తదితర వాటిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు సీహెచ్ ప్రదీప్ కుమార్, ఏ.ఉదయ్ కిరణ్, విశ్వనాథ్, సోమరాజు, పద్మ పాల్గొన్నారు.

ధ్యానంతో జ్ఞానం, ముక్తి సాధ్యం

చాగల్లు: ధ్యానం ద్వారా జ్ఞానం, ముక్తి లభిస్తాయని పిరమిడ్ సీనియర్ మాస్టర్ ఎంఎస్ రమాదేవి అన్నారు. నిడదవోలు పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీస్ మూమెంట్ ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని ఎస్.ముప్పవరం గ్రామంలో ఉచిత ధ్యాన శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రమాదేవి మాట్లాడుతూ ధ్యానంతో ప్రశాంతతతో పాటు సంపూర్ణ ఆరోగ్యం, బుద్ధి కుశలత లభిస్తుందన్నారు. ధ్యానం సర్వ రోగ నివారిణి, సత్యజ్ఞాన ప్రసాదిని, సకల భోగాల ప్రసాదిని అన్నారు. ధ్యానంతో శారీరక, నాడీ మండలం శుద్ధి కలుగుతుందని ఆమె అన్నారు. నిడదవోలు పిరమిడ్ స్పిరిచ్యువల్ ట్రస్ట్ అధ్యక్షుడు ఏంఏ ప్రసాద్ మాట్లాడుతూ ధ్యానం చేసినా, ధ్యాన ప్రచారం చేసిన వారు ఉన్నత స్థాయికి ఎదుగుతారన్నారు. కార్యక్రమంలో ఎం.విజయలక్ష్మి, బి.సత్యనారాయణ, ఎ.సత్యనారాయణ, చాగల్లు, దారవరం, పశివేదల, ఊనగట్ల, నిడదవోలు తదితర ప్రాంతాల నుంచి ధ్యానులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ భవనానికి భూమిపూజ


భూమిపూజ చేస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు విజయదుర్గ

చాగల్లు: రాష్ట్రంలో అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని జెడ్పీటీసీ సభ్యురాలు గారపాటి విజయదుర్గ అన్నారు. బ్రాహ్మణగూడెం తెలగా సంఘం వినాయకుడి ఆలయం వద్ద కొత్తగా నిర్మిస్తున్న కాపు కమ్యూనిటీ హాల్‌కు ఆదివారం విజయదుర్గ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు, విజయదుర్గ దంపతులు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ సర్పంచ్ గురువెల్లి కుమారి, గారపాటి విష్ణుమోహనరావు, శ్రీకృష్ణదేవరాయ తెలగ కాపు సేవాసంఘం పెద్దలు, సభ్యులు, మహిళలు, యువత పాల్గొన్నారు.